క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ చలపతిరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

బుట్టాయగూడెం: మండల తహసీల్దార్‌గా పీవీ చలపతిరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కుక్కునూరులో తహసీల్దార్‌గా పని చేస్తున్న చలపతిరావు బుట్టాయగూడెం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన చలపతిరావుకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విర్డ్‌లో విజయవంతంగా శస్త్ర చికిత్సలు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ భాస్కరానంద్ కుమార్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రత్యేక వైద్య శిబిరం మంగళవారం ముగిసింది. ఈ శిబిరంలో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్ రోగులకు సేవలందించారు. 30 మంది రోగులను పరీక్షించి అందులో 6 గురికి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరానంద్ కుమార్‌ను ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అభినందించారు. ఈ శిబిరంలో డాక్టర్ భవ్యచంద్, ఆశిష్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి, తదితరులున్నారు.

ఎంపీడీవోగా శ్రీలత

కామవరపుకోట: మండలం ఎంపీడీవోగా వి.శ్రీలతను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం దెందులూరు మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తుండగా, కామవరపుకోట ఎంపీడీవోగా పని చేస్తున్న కె.శ్రీదేవి బదిలీపై దెందులూరు మండలం ఎంపీడీవోగా వెళ్లనున్నారు.

అధిక లోడు వాహనాలను అరికట్టాలి

జంగారెడ్డిగూడెం: నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ పామ్ ఆయిల్ సరఫరా చేస్తున్న అధిక లోడు లారీలు, ట్రాక్టర్లను అరికట్టాలని ఆర్టీఏను డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ సమీపంలోని నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీకి అధిక లోడుతో వెళుతున్న ట్రాక్టర్, లారీల నుంచి గెలలు రోడ్డుపై జారిపడి ప్రజలకు ప్రమాదకరంగా ఉంటున్నాయని గతంలో ఈ విషయంపై ఆర్టీఏకి ఫిర్యాదు చేసినప్పటికీ వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. వీటిపై చర్యలు తీసుకోని పక్షంలో భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆర్టీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

టీడీపీ నేతల మధ్య విభేదాలు బట్టబయలు

చింతలపూడి: మండలంలోని రేచర్లలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద అధికారులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే కార్యక్రమం జరుగుతుండగా గ్రామంలోని వక వర్గం నాయకులను వేదిక పైకి పిలవలేదని మరో వర్గం నాయకులు పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. గ్రామంలోని ముఖ్య నాయకులు ఇచ్చిన లిస్ట్ ప్రకారమే పిలిచామని అధికారులు చెప్పినా వినకుండా ఘర్షణకు దిగినట్లు తెలిసింది. దీంతో టీడీపీలోని రెండు వర్గాల కార్యకర్తల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో కష్టపడిన వారికి గ్రామంలోని పార్టీ నాయకులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని టీడీపీలోని ఒక వర్గం కార్యకర్తలు వాపోతున్నారు.

పూనా ఒప్పందంతో ఎస్సీల రాజకీయ భవిష్యత్ నాశనం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కులాల రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసి, రాజకీయ బానిసలుగా చేసినది ఎంకే గాంధీ నిర్ణయాలు, పూనా ఒప్పందమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ విమర్శించారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో 93వ పూనా ఒప్పందం దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ చేసిన కృషిని ఏర్పడిన అడ్డంకులు తదితర అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గారపాటి నాగేశ్వరరావు, వెంపా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

- మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాలి
- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు



లింగపాలెం: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు



కొయ్యలగూడెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

లింగపాలెం: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారి ఎ.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యడవల్లి, లింగపాలెం గ్రామాల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతేనన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జున రావు, మండల టీడీపీ అధ్యక్షులు గరిమల చలపతి, పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీవ ఎరువులు వాడాలి

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం వారంలో ప్రతి మంగళ, బుధవారాలలో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి చెన్నకేశవులు తెలిపారు. రోజుకు రెండు గ్రామాలు చొప్పున ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా అచ్యుతాపురం, పొంగుటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ముందుగా ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. అనంతరం సచివాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించి, వివిధ పథకాలను వివరించారు. వరిలో ప్రస్తుతం ఎండాకు తెగులు గమనించామన్నారు. దీని నివారణకు ప్లాంటమైసిన్ పిచికారీ చేసుకోవాలి సూచించారు. రైతులు జీవ ఎరువులు, పురుగు మందులు అయిన పాస్కో బ్యాక్టీరియా, ట్రైకోడెర్మా వీరిడీ విధిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిపాటి నాగమణి, రైతులు వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ, మార్కెటింగ్ శాఖ, ప్రకృతి వ్యవసాయాధికారులు, వ్యవసాయ అసిస్టెంట్ కోరుకొండ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

కుక్కునూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయశాఖాధికారి ఆర్.బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఏవో బాలాజీ రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. సాగులో మెళకువలు, సోలార్ పద్ధతుల గురించి వివరించడంతో పాటు పంట దిగుబడి ఏ విధంగా పెంచాలనే విషయమై రైతులకు వివరించారు.

ఆడమిల్లిలో

కామవరపుకోట: మండలంలోని ఆడమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, గూడపాటి కేశవరావు, మండల వ్యవసాయాధికారి సి.పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ బిందు సేద్యం మేలు

టి.నరసాపురం: సూక్ష్మ బిందు సేద్యం, పచ్చిరొట్ట విత్తనాలు పెంపకం వంటి యాజమాన్య పద్ధతులతో పెట్టుబడులు తగ్గించుకోవచ్చని చింతలపూడి ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. మండలంలోని వల్లంపట్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి బి.సుమలత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాగకుమార్ పలు అంశాలను రైతులకు వివరించారు. ఈ-పంట నమోదు ప్రయోజనాలు, పచ్చిరొట్ట ఎరువులు వాడి భూసారాన్ని పెంచడం, ధాన్యం కొనుగోలు, డ్రిప్ ఇరిగేషన్, ప్రభుత్వం అందించే సబ్సిడీలు, తదితర విషయాలను తెలియజేశారు. వరిలో దోమ పోటుకు తూటి కాడల కషాయం పని చేస్తుందన్నారు. కాగా, వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులు, రైతులు అన్ని విషయాలు చర్చించుకొని మేలైన దిగుబడి సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి.నీలమణికంఠ, పశుసంవర్ధక శాఖ సహాయకులు యు.అశోక్‌తేజ, మాజీ సొసైటీ అధ్యక్షులు పేరుబోయిన శ్రీనివాస్, చవల అప్పలరాజు, శింగంశెట్టి సత్యనారాయణ, పి.వేణు, పి.శ్రీను, వి.అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు

బుట్టాయగూడెం: వరి పంటలో అగ్గి తెగులు ఉన్నట్లు గుర్తించామని, నివారణకు రైతులు పొటాష్ ఎరువును వినియోగించుకొని తగు చర్యలు చేపట్టాలని ఏవో డి.ముత్యాలరావు తెలిపారు. బుట్టాయగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో తెగులు ఎక్కువగా ఉంటే ట్రైసైక్లోజోల్ మందు 120 గ్రాముల, 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చెయ్యాలన్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, మల్బరీశాఖ అధికారి పైదా సత్యనారాయణ, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఉప సర్పంచ్ కె.శ్రీనివాస్, రైతులు సందీప్, తోటకూర నాగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



టి.నరసాపురం: పొలం పిలుస్తోందిలో వ్యవసాయాధికారులు



కామవరపుకోట: పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. ఒక్కరోజు ఆదాయం రూ: 1,20,643 వచ్చినట్లు, 1200 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మద్ది అసిస్టెంట్ కమిషనర్‌గా ఆర్‌వీ చందన

జంగారెడ్డిగూడెం రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్‌గా ఆర్‌వీ చందన బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఎంఎస్ఎన్ సత్రం నుంచి చందన మద్ది క్షేత్రానికి బదిలీపై వచ్చారు. అలాగే ఇప్పటి వరకు ఈవోగా పని చేసిన ఆకుల కొండలరావు కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు శ్రీకొండాలమ్మ ఆలయ ఈవోగా బదిలీపై వెళ్లారు.

విజయదుర్గమ్మ ఆలయానికి విరాళం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు ద్రవ్య సహాయాన్ని అందించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణానికి చెందిన రాందేవ్ లేస్ ఫ్యాబ్రిక్స్ ఫ్యాన్సీ షాప్ నిర్వహించుచున్న రాజస్తానీ మార్వాడి సోదరులు రాజ పురోహితు దిలీప్ కుమార్ సింగ్, రాజ పురోహిత్ భరత సింగ్, రాజ పురోహిత మనోహర్ సింగ్ రూ.50 వేలు ఆలయ అభివృద్ధి నిమిత్తం మంగళవారం కమిటీ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ మోహనరావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, ఉపాధ్యక్షుడు వందనపు అప్పలరాజు, యర్రం ఉదయ్ కుమార్, రాజ పురోహిత్ అశోక్ సింగ్, జల్లిపల్లి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

సీపీఐ మండల కార్యదర్శి గురవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య

చింతలపూడి: కూటమి 100 రోజుల పాలనలో సాధించిన అభివృద్ధి ఏమీ లేదని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రేచర్ల గ్రామశాఖ సమావేశం చెంచయ్య అధ్యక్షతన నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంద రోజుల్లో అభివృద్ధి పనులు ఒక్కటీ చేయలేదని విమర్శించారు. స్థానిక సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై దశలవారీ పోరాటం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో స్వార్థ రాజకీయాల కోసం టీటీడీ లడ్డూ నాణ్యతపై దేశ ప్రజల మనోభావాలను రాజకీయ నేతలు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఎన్‌డీడీబీ నుంచి జూలైలో నివేదిక అందితే ఎందుకు చర్యలు తీసుకోలేదని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను ప్రశ్నించారు. ఘటనపై తక్షణం సీబీఐతో విచారణ చేయించాలని భక్తులకు తిరుమల ప్రసాదంపై అపోహలు తొలగించాలన్నారు. మతోన్మాద స్వార్థ రాజకీయ కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల సీపీఐ సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, దొంతా కష్ణ, ఇస్తరాకుల వెంకటేశ్వరరావు, డి.తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.అద్దయ్య మున్సిపల్ కమిషనర్ సురేంద్రకుమార్

జంగారెడ్డిగూడెం: ప్రధాన మంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ ప్లానింగ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కండేయపురం 5 పీఎంఏవై లేఅవుట్లు ఉన్నాయని, ఈ 5 లే అవుట్లకు ప్రత్యేక అధికారులను నియమిస్తామన్నారు. సచివాలయాల వారీగా ప్లానింగ్, ఇంజనీరింగ్ కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ఈ నెల 28న లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఆర్డీవో చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.నరేంద్రకుమార్, మేనేజర్ కేవీ రమణ, మున్సిపల్ ఏఈ సంధ్య, హౌసింగ్ ఏఈ బి.సందీప్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసి, వారి జీవితాలలో వెలుగులు నింపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని గుండుగూడెంలో సాడే రాంబాబు అధ్యక్షతన సీపీఐ గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజనులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులను పట్టించుకోవడంలో పాలక ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, కురాకుల బాబురావు,కొన్నె లక్ష్మయ్య, జిల్లా మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు వర్కా శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

లింగపాలెం: గోల శ్రీనుపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని యాదవ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాట్రూ బాలు హెచ్చరించారు. లింగపాలెం మండలం ముడిచర్ల ఆదివారం గోల శ్రీను అనే వ్యక్తిపై తోటలో వేరే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి విచక్షణారహితంగా కొట్టి, దాడి చేయడంతో, ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, నిందితులపై కేసు కట్టకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ వద్ద, నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యేతో కూడా మాట్లాడతామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కొండుబోయిన యువరాజు, పిల్లల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: కోడిపందేలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. బయ్యన్నగూడెం సమీపంలోని మారుమూల నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.7,520 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు



చింతలపూడి: డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సేవలను వివరిస్తున్న దృశ్యం



కామవరపుకోట: కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

చింతలపూడి: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిస్వార్థ సేవ, సమాజ వికాసానికి ఎస్ఎస్ఎస్ ప్రతీక అని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పట్టణంలోని పేదలకు, అనాథలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ఆశయాలను కొనసాగిస్తామని, సమాజాభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జెకె నరేంద్ర కుమార్, అధ్యాపకులు డాక్ట్ ఎ.సంతోషరావు, కె.హరి ప్రసాద్, పి.అచ్చిబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలను వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు జాతీయ సేవా పథకం యొక్క ఆవిర్భావం, లక్ష్యాలు, విధులు, వాలంటీర్స్ చేయవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



జీలుగుమిల్లి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. కొండలపై అధికంగా వర్షం పడటం వలన బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం కురిసిన వర్షానికి వరదనీరు 217 మీటర్లకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రాత్రి సమయం వరకూ వర్షం కురవడంతో జలాశయానికి 650 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో వరద నీరు వచ్చి చేరుతుందని దీంతో 200 క్యూసెక్‌ల నీటిని రెండు గేట్లు ఎత్తి విడుదల చేసినట్లు ఎంఐ ఏఈ సురేష్ తెలిపారు. అదే విధంగా జీలుగుమిల్లి మండలంలో కూడా భారీగా వర్షం కురవడంతో గ్రామ సమీపంలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతి తగ్గిన తర్వాత వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఉండాలి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో బులియన్ మర్చంట్స్ కల్యాణ మండపంలో వాణిజ్య, వర్తక సంఘాల ప్రతినిధులతో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ప్రాంతంలో దుకాణ సముదాయాల్లో విధిగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బులియన్ వర్తక సంఘాల ప్రతినిధులు బంగారాన్ని కొనుగోలు చేసిన, తాకట్టు పెట్టిన వినియోగదారుని సమాచారాన్ని విధిగా తెలుసుకోవాలని హెచ్చరించారు. షాపుల వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా మెయిన్ బజార్‌లో నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీస్‌స్టేషన్ లేదా 112కు సమాచారాన్ని తెలియజేయాలని సీఐ కోరారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ళ బారినపడితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని, బాధితులకు సైబర్ సెల్ పోలీసులు సహాయం చేస్తారని తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఏలూరు ప్రజలు 95503 51100కు ఆధారాలతో వివరాలను వాట్సాప్‌లో పొందుపరచాలని సీఐ సత్యనారాయణ కోరారు. నేరాలను నియంత్రించేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు పైడేటి రామారావు, అధ్యక్షుడు తమ్మన మధుసూధన్‌రావు, సెక్రటరీ నంగులూరు సత్యనారాయణ, కొనకళ్ళ దామోదర్, మద్దాల మురళీ, జాయింట్ సెక్రటరీ వెన్నంరెడ్డి మహేష్, భాస్కర మణికంఠ, ట్రెజరర్ కనిగొళ్ళ మల్లిఖార్జునరావు, సంఘం సభ్యులు ఉన్నారు.

ఇష్టారాజ్యంగా మందులను వినియోగించవద్దు

ఏలూరు టౌన్: ప్రజలు ఇష్టారాజ్యంగా మందులను వినియోగించటం ద్వారా కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు 4వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 17న ప్రారంభమైన జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఫార్మకాలజీ వైద్య బృందం ఈ వారోత్సవాలను నిర్వహించటంతోపాటు ఏలూరు నగరంలో ప్రజలకు, ఏలూరు జీజీహెచ్‌కు వైద్యసేవలకు వచ్చే రోగులు, సహాయకులకు, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థినులు, సిబ్బందికి విస్తృతంగా అవగాహన కల్పించారని తెలిపారు. ఈ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు జీజీహెచ్‌లోని ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఎంసీ (అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మోనటరింగ్ సెంటర్)ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సెంటర్ ద్వారా మందుల వినియోగంతో కలిగే చెడు ప్రభావాల సమాచారాన్ని సేకరించి జాతీయ స్థాయి అధికారులకు రిపోర్ట్ చేశామన్నారు. వైద్యుల సలహా లేకుండా మందుల వినియోగంతో కలిగే నష్టాలను నివారించేందుకు ఏఎంసీ సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే.భాస్కర్, వైస్ ప్రిన్సిపల్(అకాడమిక్) డాక్టర్ పీ.సత్యనారాయణ, ఏలూరు జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్ఎంవో డాక్టర్ దుర్గాకుమార్, డిప్యూటీ అస్ట్రోనెల్ సూపరింటిండెంట్ డాక్టర్ మల్లిఖార్జున, ఫార్మకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మావతి, అసోసియేట్ ప్రొఫెసర్స్ డాక్టర్ ఎస్.విజయకుమార్, డాక్టర్ పీ.రాజసులోచన, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌమ్య, డాక్టర్ హరిణి, డాక్టర్ రమ్య, తదితరులు ఉన్నారు.